ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 21 జూలై 2025

శాకంబరి అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి గవరపాలెంలో నూకాంబిక అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బాలాలయంలోని అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాధారణ భక్తులకు అమ్మవారి దర్శనం ప్రారంభించారు. - అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి



నూకాంబిక అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించిన దృశ్యం

పయనీర్‌తో వంతెనకు ముప్పు

భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతింటున్న మామిడివాక గెడ్డ బ్రిడ్జి

- నిబంధనలు పాటించకపోతే కంపెనీకి తాళాలు వేయిస్తా
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు హెచ్చరిక



వంతెన అడుగున కాంక్రీట్ ఊడిపోయి బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు



మామిడివాక గెడ్డ వంతెనను పరిశీలిస్తున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు, అధికారులు.

కశింకోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డులో మామిడివాక గెడ్డ వంతెన మీదుగా పరిమితికి మించిన బరువుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే మాకవరపాలెం మం డలం రాచపల్లిలోని పయనీర్ (గతంలో అన్‌రాక్) కంపెనీకి తాళాలు వేయి స్తానని శాసన సభ స్పీకర్ చింతకా యల అయ్యన్నపాత్రుడు హెచ్చరిం చారు. సుమారు ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన ఏడాది క్రితం వరకు బేషుగ్గానే వుంది. అయితే పయనీర్ కంపెనీకి ముడిసరకు రవాణా చేసే భారీ వాహనాల రాకపోకలతో పలుచోట్ల దెబ్బతిన్నది. వారం రోజుల క్రితం ఆర్‌అండ్‌బీ నర్సీపట్నం డీఈ ఆర్‌ఆర్ విద్యాసాగర్ ఈ వంతెనను పరిశీలించారు. భారీ వాహనాల కారణంగా వంతెన దెబ్బతిం టున్నట్టు గుర్తించారు.కొత్త వంతెన నిర్మించాలని, లేదంటే మరమ్మతులు చేసి, భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు నివేదించారు. దీంతో ఆయన ఆదివారం ఉదయం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అధికారులతో కలిసి వంతెనను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, 20 టన్నుల సామర్థ్యం కలిగిన ఈ వంతెన మీదుగా సుమారు 60 టన్నుల బరువుతో పయనీర్ కంపెనీకి ముడిసరకును రవాణా చేస్తున్నారన్నారు. దీనివల్ల వంతెనకు ముప్పు వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్ష ణమే నిపుణులతో నాణ్యత పరిశీలన చేయించి, మరమ్మతులు చేయాలా? లేదంటే కొత్త వంతెన నిర్మించాలా? అన్నదానిపై నివేదిక ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వంతెన సామర్థ్యానికి మించి భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ... మిగతా 6వ పేజీలో

తుది దశలో తాండవ పనులు

75 పనులకు రెండు విడతల్లో రూ.6.3 కోట్లు మంజూరు చేయించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



తాండవ జలాశయం

- అత్యవసరంగా చేపట్టిన 18 పనుల్లో 14 పనులు పూర్తి
- రెండో విడతలో 57 పనులకు.. 43 పూర్తి
- ఖరీఫ్‌కు నీటి విడుదల లోగా పూర్తి చేయాలని లక్ష్యం
- మరో 25 పనులకు రూ.2.65 కోట్లతో ప్రతిపాదనలు

ఆయకట్టుకు నీటి విడుదలపై నేడు సమావేశం



మాధవవరం వద్ద తాండవ ఎడమ కాలువ అక్విడక్టు పనులను పరిశీలిస్తున్న ప్రాజెక్టు అధికారులు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

తాండవ జలాశయం కాలువలు, అక్విడక్టులకు పలుచోట్ల చేపట్టిన నిర్వహణ, మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆగస్టులో ఆయకట్టుకు నీరు విడుదల నాటికి పనులన్నీ పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

తాండవ జలాశయం కింద అనకాపల్లి జిల్లాలో నాత వరం, నర్సీపట్నం, కోటవురట్ల మండలాలు, కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, పత్తిపాడు మండలాల్లో సుమారు 52 వేల ఎకరాల ఆయకట్టు వుంది. వైసీపీ అధికారంలో వున్న ఐదేళ్ల కాలంలో ఒక్క ఏడాది కూడా పంట కాలువల్లో నిర్వహణ పనులు చేపట్టలేదు. కాలువల్లో పూడిక, తుప్పలు పెరిగిపోయాయి. పలుచోట్ల మదుములు, అక్విడక్టులు, రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ఈ సమస్యలతో పొలాలకు నీరు సరిగా అందక రైతులు ఇబ్బంది పడ్డారు. అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో నిర్వహణ పనులు చేయలేదు. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్పీకర్ అయ్యన్నపాత్రుడు, తాండవ ప్రాజెక్టు సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అత్యవసరంగా చేపట్టాల్సిన 18 పనులకు రూ.2.1 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో నిమ్మకట్టులో పూడిక తొల గించి గట్టును పటిష్ఠ పరిచారు. కాలువలపై పలుచోట్ల అక్విడక్టులను పునర్నిర్మించారు. 14 ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన నాలుగు పనులు జరుగుతు న్నాయి. రైతులు, నీటి సంఘాల ప్రతినిధుల వినతి మేరకు మరో 57 పనులకు రూ.4.2 కోట్లు మంజూరు చేయించారు. అక్విడక్టులు, అండర్ టన్నెళ్ల పనులు చేపట్టగా, వీటిలో 43 పనులను ఇప్పటికే పూర్తి చేశారు. 14 పనులు ... మిగతా 6వ పేజీలో

కరుణించిన వరుణుడు

- అపరాలు, చిరుధాన్యాల పంటలకు మేలు
- వరినారుమళ్లకు ఊపిరి పోసిన వాన
- చోడవరంలో భారీ వర్షం

చోడవరం, మాడుగుల, ఎలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల్లో వర్షం



చోడవరంలో కురుస్తున్న వర్షం

జిల్లాలోని చోడవరం, మాడుగుల, అనకాపల్లి, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఆదివారం మధ్యాహ్నం తరువాత మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అంతకుముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాసింది. రెండు గంటల తరువాత వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. అపరాలు, చిరుధాన్యాల పంటలతోపాటు వరి నారుమళ్లకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చోడవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అంతకుముందు ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తీక్షణంగా కాసిన ఎండ, ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. తరువాత వాతావరణం పూర్తిగా మారిపోయింది. మూడు గంటల సమయంలో ఉరుములు, పిడుగులతో గంటకు పైగా భారీ వర్షం కురిసింది. గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వాతావరణం ... మిగతా 6వ పేజీలో



చీడికాడలో వరి నారుమడిలో చేరిన వర్షం నీరు

బదిలీ అయినా... అక్కడే!

పాత పాఠశాలల్లోనే టీచర్ల విధులు

- 100 మందికిపైగా హిందీ పండిట్లు వెనక్కి
- కొన్నిచోట్ల సబ్జెక్టు టీచర్లకూ తప్పని అవస్థలు
- ఇప్పటికీ రిలీవ్ కాలేని పరిస్థితి
- ఆ స్థానంలో కొత్తవారు రాకపోవడమే కారణం
- డీఎస్సీ నియామకాలు జరిగే వరకు ఇదే పరిస్థితి



విశాఖపట్నం డీఈవో కార్యాలయం (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

పాఠశాల విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారింది. మొత్తం బదిలీల్లో 40 శాతం మంది ఇప్పటికీ పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 100 మంది హిందీ పండిట్లు, మరికొన్ని సబ్జెక్టుల టీచర్లు కొత్త పాఠశాలల్లో చేరలేదు. టీచర్ల కొరత నేపథ్యంలో బదిలీ అయినా రిలీవ్ చేయడంలో సమస్య ఉత్పన్నమైంది. డీఎస్సీ ఫలితాలు వెల్లడించిన తరువాత కొత్తవారికి పోస్టింగ్స్ ఇచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

గత నెలలో నిర్వహించిన ప్రక్రియలో ఉమ్మడి జిల్లాలోని అన్ని కేటగిరీలకు చెందిన సుమారు ఐదువేల మంది టీచర్లకు బదిలీ అయింది. ఒకే చోట ఎనిమిదేళ్లు పూర్తిచేసుకున్న ఎస్జీటీలు, స్కూలు అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లు ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు బదిలీ అయ్యారు.

అయితే అంతేస్థాయిలో టీచర్లు ఏజెన్సీ, మారుమూల గిరిజన, గ్రామీ ణ ప్రాంతాలకు వెళ్లలేదు. నిబంధనల మేరకు ఉపాధ్యాయుడు ఒక పా ఠశాల నుంచి రిలీవ్ కావాలంటే ఆ స్థానంలో మరొకరు బాధ్యతలు తీసు కోవాలి. కానీ కొరత నేపథ్యంలో వీరంతా బదిలీ అయిన పాఠశాలల్లో జా యినింగ్ రిపోర్టు ఇచ్చి, తిరిగి పాత పాఠశాలల్లోనే పాఠాలు బోధించా ల్సిన పరిస్థితి నెలకొంది.

టీచర్ల కొరతే కారణం

ఉమ్మడి జిల్లాలో పోస్టులకు తగినంత మంది హిందీ పండిట్లు లేరు. మూడు జిల్లాల పరిధిలో సుమారు 100 మంది హిందీ పండిట్లు అవసరం. కొత్త డీఎస్సీలో 28 హిందీ పండిట్ పోస్టులు మాత్ర మే భర్తీకానున్నాయి. ఈ ఏడాది జీవో నంబ రు 177 రద్దు చేసిన తరువాత చేపట్టిన సంస్క రణలతో కొన్ని ఉన్నత పాఠశాలల్లో రెం డు, మూడో హిందీ పోస్టు అవసరం ఏర్ప డింది. ఎక్కువగా విశాఖ, అనకాపల్లి జిల్లా ల్లోని రోడ్లకు ఆనుకుని ఉన్న ఉన్నత పాఠ శాలల్లో కొత్త పోస్టులు కేటాయించారు. బదిలీల సమయంలో ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లోని హిందీ పండిట్లు ఈ పాఠశాలలకు ఆప్షన్ ఇచ్చారు. వారి స్థానంలో కొత్తవారు వచ్చేందుకు పండిట్ల కొరత ఏర్పడింది. దీంతో 100 మంది హిందీ పండిట్లు కొత్త స్థానాల్లో రిపోర్టుచే సి, తిరిగి వెనక్కి వెళ్లిపోయారు. దీంతో ఆయా పాఠశాలల్లో బోధనకు స రిపడా హిందీ పండిట్లు లేరని సంబంధిత హెచ్ఎంలు వాపోతున్నారు. మిగిలిన సబ్జెక్టులకు సంబంధించి కొన్నిచోట్ల స్కూలు అసిస్టెంట్లు కొత్త పాఠశాలలో రిపోర్టుచేసి తిరిగి వెళ్లిపోయారు. మోడల్ ప్రాథమిక పాఠ శాలల హెచ్ఎంలుగా పోస్టింగ్ పొందిన స్కూలు అసిస్టెంట్లదీ అదే పరి స్థితి. దీనికితోడు జూన్ నెలాఖరున ఉమ్మడి జిల్లాలో 100 మందికిపైగా టీచర్లు ఉద్యోగ విరమణ చేశారు. ఈనెలలో మరో 100 మంది వరకు రిటైర్ కానున్నారు. దీంతో పలుపాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడింది.

నగరంలోని హెచ్‌సీ వెంకటాపురం పాఠశాలలో రెండు బయాలజీ అసిస్టెంట్ పోస్టులున్నాయి. బదిలీపై ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఇద్దరు టీచర్లలో ఒకరు గతనెలలో ఉద్యోగ విరమణ చేశారు. మరొకరు గతంలో పనిచేసిన పాఠశాలలోనే ఉండాల్సి రావడంతో ఇక్కడ పాఠాలు బోధించేవారు కరవయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నా యం అన్వేషించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేట సెగ్మెంట్‌లో వైసీపీకి దెబ్బ

ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు బొలిశెట్టి రాజీనామా

- వైసీపీ అధిష్ఠానం తీరుతో మనస్తాపం
- 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ' కార్యక్రమంలో పాల్గొనడం ఇష్టంలేదని వెల్లడి

ఎస్.రాయవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గంలో వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. ఎస్.రాయవరం మండలానికి చెందిన సీనియర్ నాయకుడు, మండల పరిషత్ తాత్కాలిక అధ్యక్షుడు అయిన బొలిశెట్టి గోవిందరావు ... మిగతా 6వ పేజీలో



బొలిశెట్టి గోవిందరావు

తొలి అడుగు వేగవంతం చేయాలి

టీడీపీ కేడర్‌కు జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు పిలుపు

- జిల్లాలో 5,19,709 నివాసాలు.. ఇంతవరకు 2,00,479 నివాసాలు మాత్రమే సందర్శన
- ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశం



మీడియా సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు. పక్కన ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు

అనకాపల్లి రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పార్టీ శ్రేణులకు సూచించారు. అనకాపల్లిలోని టీడీపీ జిల్లా కార్యాల యంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, అమలు పరిచిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు జూలై రెండో తేదీ నుంచి నెలాఖరు వరకు ఇంటింటా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించినట్టు చెప్పారు. జిల్లాలో మొత్తం ఐదు లక్షల 19 వేల 709 నివాసాలు ... మిగతా 6వ పేజీలో

లారీ ఢీకొని మహిళ మృతి

మరోసారి రక్తసిక్తమైన లంకెలపాలెం కూడలి

- కుమార్తె ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా ఘటన



ఆదిలక్ష్మి (ఫైల్)

లంకెలపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లంకెలపాలెం కూడలి మరోసారి రక్తసిక్తమైంది. రోడ్డు దాటుతున్న మహిళను, వేగంగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ప్రమాదానికి సంబంధించి పరవాడ పోలీ సులు తెలిపిన వివరాలిలా వున్నాయి. లంకెలపాలెం శ్రీరంగన గర్ కాలనీలో దాసరి లక్ష్మణరావు, ఆదిలక్ష్మి(65) దంపతులు నివాసం వుంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం కూర్మన్నపా లెంలో నివాసం వుంటున్న పెద్దకుమార్తె ఇంటికి వెళ్లడానికి లంకెలపాలెం కూడలిలో వున్న బస్టాప్ వద్దకు నడుచుకుంటూ వస్తున్నారు. తొలుత లక్షణరావు రోడ్డు దాటారు. ఆయన వెనుక వస్తున్న ఆదిలక్ష్మి రోడ్డు దాటుతుండగా గాజువాక వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న లారీ బలంగా ఢీకొంది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కళ్ల ముందే భార్య దుర్మరణం చెందడంతో లక్ష్మణరావు కన్నీరుమున్నీరు అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. లారీ డ్రైవర్ పైడిరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

శాకంబరిగా నూకాంబిక



ఎలమంచిలి: పీఎస్‌ఆర్‌పేటలో శాకంబరి అలంకరణలో నూకాంబిక అమ్మవారు

ఎలమంచిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మనాభరాజుపేటలో గల నూకాంబిక అమ్మవారు ఆదివారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో ఎడ్ల శ్రీనిబాబు ఆధ్వర్యంలో పద్మనాభరాజుపేట, బయ్యవరం ఉభయ గ్రామాల భక్తులు అందించిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాయకరావుపేటలో..

ఈ ఏడాది ఆషాఢమాసం పురస్కరించుకుని పట్టణంలోని మంగవరంరోడ్డులో ఉన్న నూకాలమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు.

తుది దశలో తాండవ పనులు

... 5వ పేజీ తరువాయి

వివిధ దశల్లో ఉన్నాయి. కాగా మరో 25 పనులకు రూ.2.65 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పెట్టారు.

నేడు ఆయకట్టు రైతులతో సమావేశం

నాతవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ నుంచి ఖరీఫ్‌కు నీటి విడుదల విషయమై సోమవారం నాతవరం జలవనరుల శాఖ కార్యాలయంలో తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ అధ్యక్షతన నీటి సంఘాల అధ్యక్షులు, ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు. అత్యధికుల అభిప్రాయాల మేరకు నీటి విడుదల తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 369.1 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది ఇదే తేదీనాటికి 365.4 అడుగులు మాత్రమే వున్నట్టు చెప్పారు.

'పయనీర్'తో వంతెనకు ముప్పు

... 5వ పేజీ తరువాయి

స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. అదే విధంగా నర్సీపట్నం నుంచి చింతపల్లి మండలం లంబసింగి వరకు రోడ్డును విస్తరించాలని, దీనివల్ల రెండు జాతీయ రహదారులకు అనుసంధానం ఏర్పడి, రవాణా సదుపాయం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, నర్సీపట్నం డీఈ విద్యాసాగర్, అనకాపల్లి ఏఈ ఎన్.సాంబశివరావు, పెదబొడ్డేపల్లి ఏఈ కె.నారాయణరెడ్డి, నర్సీపట్నం ఏఈ ఎస్.ఎల్.నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు

... 5వ పేజీ తరువాయి

చల్లబడడంతో ప్రజలు ఉపశమనం చెందారు. కాగా మండలంలో 37 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

రావికమతం మండలంలో..

రావికమతం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం మధ్యాహ్నం తరువాత ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. కొద్ది రోజుల నుంచి వర్షాలు లేకపోగా.. వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండడంతో వరి నారుమళ్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో వర్షం పడడంతో ఊటర చెందారు. వరి ఆకుమడులకు ఈ వర్షం ఊపిరి పోసిందని అంటున్నారు. అదే విధంగా ఇప్పటికే నాటిన సరుగుడు మొక్కలకు ఈ వర్షం ఎంతో దోహదపడుతుందని చెబుతున్నారు.

చీడికాడలో..

చీడికాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చీడికాడతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. రెండు, మూడు వారాల క్రితం వరి విత్తనాలు చల్లిన తరువాత వర్షాలు లేకపోవడంతో నారుమడులు ఎండిపోయి బీటలువారాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఆదివారం భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. అయితే వరినాట్లు వేయడానికి భారీ వర్షాలు కురవాల్సిన అవసరం వుందని అభిప్రాయపడుతున్నారు.

'తొలి అడుగు' వేగవంతం చేయాలి

... 5వ పేజీ తరువాయి

వుండగా, ఇప్పటి వరకు రెండు లక్షల 479 నివాసాలను మాత్రమే సందర్శించామని తెలిపారు. మిగిలిన మూడు లక్షల 19 వేల 230 ఇళ్లను ఈ నెలాఖరులోగా సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, పోలింగ్ బూత్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు పాల్గొన్నారు.

'పేట' సెగ్మెంట్‌లో వైసీపీకి దెబ్బ

... 5వ పేజీ తరువాయి

వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఎస్.రాయవరంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలను వెల్లడించారు. సుమారు నాలుగేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో వైసీపీ తరపున 18 మంది సర్పంచులు, 17 మంది ఎంపీటీసీలను గెలిపించుకున్నామని గుర్తుచేశారు. అప్పట్లో తమ పార్టీకి చెందిన కొంతమంది నేతల తీరువల్ల ఇబ్బందులు కలగడంతో, నాటి సీఎం జగన్‌ను కలవడానికి అవకాశం కల్పించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడికి, మంత్రులకు, నియోజకవర్గం కన్వీనర్‌కు విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. కానీ మూడేళ్ల కాలంలో ఒక్కసారి కూడా జగన్‌ను కలిసే అవకాశం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి తరువాత కూడా ఇదే పరిస్థితి కొనసాగిందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డిపై అభిమానంతో ఆయన కుమారుడైన జగన్మోహన్‌రెడ్డి వైసీపీని స్థాపించిన వెంటనే ఆ పార్టీలో చేరానని, వైసీపీ అభివృద్ధికి ఎంతో కష్టపడినప్పటికీ అధిష్ఠానం తనను చిన్నచూపు చూస్తున్నదని గోవిందరావు వాపోయారు. పార్టీ నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ' అనే కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఇష్టం లేదని, ఈ కారణాల వల్ల వైసీపీకి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు గోవిందరావు ప్రకటించారు. ప్రస్తుతానికి ఏ రాజకీయ పార్టీలో చేరడం లేదని, ఎంపీపీ (తాత్కాలిక) పదవిలో మాత్రం కొనసాగుతానని స్పష్టం చేశారు.

మా గ్రామాన్ని తరలించండి

- ఎమ్మెల్యే విజయకుమార్‌కు లాలంకోడూరు గ్రామస్థుల వినతి
- కాలుష్యంతో ఉండలేకపోతున్నామని ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాన్ని తరలించి ఆదుకోవాలని మండలంలోని లాలంకోడూరు గ్రామస్థులు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కోరారు. ఆదివారం లాలంకోడూరు గ్రామస్థులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఎస్ఈజడ్‌లోని ఫార్మా పరిశ్రమల నుంచి వెలువడే పొల్యూషన్‌తో ఉండలేకపోతున్నామని గ్రామస్థులు చెప్పారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేదని, తాగునీటికి కూడా ఇబ్బంది ఉందని, కంపెనీలు నుంచి వెలువడే వ్యర్థనీరు గ్రామాన్ని ఆనుకొని ఉన్న కాలువల్లో ప్రవహిస్తూ కంపుకొడుతుండడంతో అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. తమ గ్రామాన్ని తరలించి, అన్నివిధాల ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ గ్రామాన్ని తరలించే అంశంపై ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, కమిటీ తీసుకున్న నిర్ణయాలను తనకు తెలియజేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళతానన్నారు. లాలంకోడూరు గ్రామస్థులకు న్యాయం జరిగేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి కావాల్సిన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలను అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవాని, మండల వైఎస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షులు లాలం భరత్, మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, నాయకులు డీఎస్ఎన్‌రాజు, లాలం సత్యప్రసాద్, లాలం రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఎలమంచిలి బస్టాండ్‌ను సందర్శించిన పీటీడీ ఈడీ

నూతనంగా నిర్మించిన డ్రైవర్ల విశ్రాంత గది పరిశీలన... సిబ్బందికి పలు సూచనలు



ఎలమంచిలి పీటీడీ బస్టాండ్‌లో డ్రైవర్ల విశ్రాంత గదిని పరిశీలిస్తున్న పీటీడీ ఈడీ కె.బ్రహ్మానందరెడ్డి, జిల్లా ప్రజారవాణా అధికారి ప్రవీణ

ఎలమంచిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పీటీడీ బస్టాండ్‌ను ఆదివారం పీటీడీ విజయనగరం జోన్-1 ఈడీ కె.బ్రహ్మానందరెడ్డి, జిల్లా రవాణా అధికారి ప్రవీణ సందర్శించారు. బస్టాండ్ ఆవరణతో పాటు నూతనంగా నిర్మించిన డ్రైవర్ల విశ్రాంతి భవనాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు అందించారు. బస్టాండ్ 2వ అంతస్తుపై నూతనంగా నిర్మించిన డ్రైవర్ల విశ్రాంత గదిని ఈ నెల 22 వ తేదీన రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు ప్రారంభించనున్నారని తెలిపారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి అసిస్టెంట్ మేనేజరు గౌరీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు వసతులు కల్పించాలి : ఎమ్మెల్యే

అచ్యుతాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రయాణికులకు వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం అచ్యుతాపురంలో గల స్వగృహంలో పీటీడీ విజయనగరం రీజియన్ ఈడీ డీకే బ్రహ్మానందరెడ్డి, జిల్లా ప్రజారవాణా అధికారి వి. ప్రవీణలు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గల అచ్యుతాపురం, మునగపాక, రాంబిల్లిలలో ప్రయాణికులకు వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. బస్సుల్లో ఫుట్‌పాత్‌పై విద్యార్థులు ప్రయాణాలు చేయడం తమ దృష్టికి వచ్చిందని, దీనిని నివారించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : పప్పల



రావిపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న చలపతిరావు, ప్రగడ



లోవపాలెంలో బ్రోచర్లు అందజేస్తున్న అజయ్

అచ్యుతాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. ఆదివారం మండలంలోని రావిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, రాజాన నానాజీ, తమరాన అప్పలనాయుడు, బంటుపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వెదురువాడలో సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో టీడీపీ నాయకుడు కొయ్య మహలక్ష్మీనాయుడు, కిల్లాడి బాబ్జీ, బి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తున్నదని తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్ అన్నారు. ఆదివారం మండలంలోని జడ్ .చింతువా పంచాయతీ లోవపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బకాయిల కోసం ఉపాధి కార్మికుల ఎదురుచూపు

- 8 వారాల నుంచి అందని వేతనాలు
- మండలంలో రూ.75 లక్షలు పెండింగ్



సుంకపూర్‌లో పనులు చేస్తున్న ఉపాధి కార్మికులు

కోటవురట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేస్తున్న ఉపాధి కార్మికులకు ఎనిమిది వారాల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బకాయిలు జనవరి నుంచి మార్చి వరకు జమ చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోందని ఉపాధి కార్మికులు వాపోతున్నారు.

ఉపాధి హామీ పథకం కార్మికులు చేసిన పనుల వివరాలను సిబ్బంది ప్రతి వారం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అలా అప్ చేసిన పనులకు సంబంధించి కార్మికులకు 15 రోజుల్లో వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. ప్రతీ ఉపాధి కార్మికుడికి రోజు వారి వేతనం రూ.300 వచ్చేవిధంగా పని కల్పించాలి. అయితే మండలంలో సగటు వేతనం రూ.298 మించలేదు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 13,396 మందికి ఉపాధి జాబ్‌కార్డులు ఉండగా.. 10,999 మంది కార్మికులు ఉన్నారు. వీరిలో ప్రస్తుతం 2,500 మంది కార్మికులు ఉపాధి పనులకు వస్తున్నారు. మంగళవారం నాటికి కార్మికులకు వేతనాలు రూ.75 లక్షలు, మెటీరియల్ రూ.80లక్షలు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఈ వేతనాలను ఎప్పుడు ఇస్తారో అని ఉపాధి కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

బకాయిలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం : ఏపీవో

ఉపాధి హామీ పనులు పనిచేసిన కార్మికుల వేతనాలు 8 వారాల నుంచి చెల్లించడం లేదని ఏపీవో నాగరాజు తెలిపారు. మండలంలో రూ.75 లక్షల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కూలీలు వేతనాల కోసం ప్రతి వారం అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. మరో వారం రోజుల్లో వేతనాలు చెల్లించే అవకాశం ఉందన్నారు.

చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

ఎక్సకవేటర్‌తో తవ్వి ట్రాక్టర్లతో తరలింపు



సైతారుపేట చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

ఎస్.రాయవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసూదిపురం రెవెన్యూ పరిధిలో సైతారుపేట గ్రామాన్ని ఆనుకొని ఉన్న మసీదు చెరువులో పట్టపగలే ఎటువంటి అనుమతులు లేకుండా ఆదివారం మట్టి అక్రమ తవ్వకాలు జరిపారు. చెరువులో ఎక్సకవేటర్ సాయంతో తవ్విన మట్టిని ఐదు ట్రాక్టర్లతో సమీపంలో వేస్తున్న ఓ దారికి తరలించారు. ఇక్కడి చెరువులో చేపట్టిన తవ్వకాలపై ఇరిగేషన్ ఏఈ భానును ఫోన్‌లో వివరణ కోరగా.. తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని బదులిచ్చారు.

కల్వర్టు కష్టాలు..

విశాఖ-దేవరాపల్లి ప్రయాణికులకు ఇక్కట్లు

దేవరాపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి-విశాఖపట్నం రోడ్డులో కృష్ణారాయుడుపేట వద్ద కల్వర్టు కూలడానికి సిద్ధంగా ఉండడంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. జీవీఎంసీకి నీరు సరఫరా చేసే కాలువపై కల్వర్టు పరిస్థితి బాగోలేదని ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టడంతో 12డి బస్సులను అక్కడ వరకు నడుపుతున్నారు. విశాఖపట్నం నుంచి దేవరాపల్లికి రూ.50 బస్సుచార్జి. అయితే కల్వర్టు బాగో లేకపోవడంతో 68డి బస్సులను కృష్ణారాయుడుపేట వద్ద నిలిపివేస్తున్నారు. ఇక్కడ నుంచి దేవరాపల్లికి ఆటోవాలాలు రూ.30 తీసుకుంటున్నారు. దీంతో తమపై అదనపు భారం పడుతుందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఈ విషయాన్ని మద్దిలపాలెం డిపో మేనేజరు కె.పద్మావతి వద్ద ప్రస్తావించగా.. తాను కల్వర్టును పరిశీలించామని, కల్వర్టు కుంగిపోయి ఉండడంతో 12డి బస్సులను కల్వర్టు వరకు నడుపుతామన్నారు. అక్కడ నుంచి ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ఉపమాకలో వైభవంగా మరిణమ్మ జాతర

నక్కపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక గ్రామంలో మరిణమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ గ్రామ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఏటా ఆషాఢమాసంలో అమ్మవారి జాతర చేయడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి పూజారులు గ్రామ పురవీధుల్లో ఊరేగారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు. గ్రామ పెద్దలు, శెట్టిబలిజ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి 23న కౌన్సెలింగ్

పాయకరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం నిర్వహించాల్సిన కౌన్సెలింగ్‌ను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 23వ తేదీ ఉదయం 8 గంటలకు పాయకరావుపేటలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా గూడుపమ్మ సారె ఊరేగింపు

- కిక్కిరిసిపోయిన రేబాక ఆలయం





అమ్మవారి సారెను తీసుకువస్తున్న మహిళలు

నక్కపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గ్రామంలో గూడుపమ్మ సారె ఊరేగింపు ఆదివారం ఘనంగా జరిగింది. ఎస్ఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రావికమతం, మాకవరపాలెం, మాడుగుల, కోటవురట్ల, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాలు, రేబాక పరిసర గ్రామాల నుంచి అనేక మంది మహిళలు రేబాక చేరుకొని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు తయారు చేసి తీసుకువచ్చిన పిండివంటలు, పలు రకాల ఫ్రూట్స్‌తో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఎస్ఎస్ఎఫ్ జిల్లా మహిళా ధర్మ ప్రచారక్ కె.లలిత అమ్మవారి గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు, సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, పెద్దలు సాదిరెడ్డి చిన వెంకన్న, నారాయణమూర్తి, వరప్రసాద్, వెల్లంకి కాసుబాబు, చెవ్వాకుల శ్రీను, శానాపతి అప్పారావు, విజయ్‌కుమార్, ప్రగడ బోసు, గరగ రాజేశ్, సాంబమూర్తి, శానాపతి బాబ్జీ, అప్పారావు, పి.రాజు, గంట్యాడ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నారుమడులకు ఊపిరినిచ్చిన వర్షం



మునగపాకలో కురుస్తున్న వర్షం

మునగపాక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వారం పది రోజులుగా వేడెక్కిన వాతావరణంతో ఎండిపోతున్న నారుమడులకు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం ఊపిరినిచ్చింది. వర్షం లేకపోవడంతో నారుమడులు ఎండిపోతున్నాయి. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం వరి నారుకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. వర్షాలు పడకపోతే దమ్ములు పట్టే అవకాశం లేకపోతుందని వారంటున్నారు.

వీహెచ్‌పీ మండల అధ్యక్షుడుగా పరదేశినాయుడు

మునగపాక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మునగపాక గ్రామానికి చెందిన శరగడం పరదేశినాయుడు విశ్వహిందు పరిషత్ మండల అధ్యక్షుడుగా నియామితులయ్యారు. గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, ప్రాంత, పార్టీలకు అతీతంగా విశ్వహిందు పరిషత్ ధర్మాన్ని పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఇటువంటి సంస్థలో పనిచేసే అవకాశం లభించడం భగవంతుని కృపగా భావిస్తున్నానని చెప్పారు. పరదేశినాయుడు వేంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్‌గా కూడా ఆధ్యాత్మిక సేవలను అందిస్తున్నారు.

యానాద్రి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎలమంచిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీ యానాద్రి అమ్మవారి ఆలయంలో ఆదివారం తెల్లవారు జాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత వారం అమ్మవారి జాతరను నిర్వహించారు. కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా బురదమాంబ అమ్మవారి జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయకుమార్,తదితరులు

ఎలమంచిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని తెరువుపల్లి వార్డులో ఆదివారం బురదమాంబ అమ్మవారి జాతరను ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారికి తెల్లవారు జాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్థానిక నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ జాతరను పురస్కరించుకుని ఆలయం వద్ద భజనలు, కోలాటాలు తదితర పలు భక్తి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు, భక్తులు పాల్గొన్నారు.

రైతు మూల సంఘం నూతన కార్యవర్గం

మునగపాక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మునగపాక ములబందగోడి రైతు మూల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక సంతబయల వినాయక కల్యాణ మండపంలో ఆదివారం ములబందగోడి రైతు మూల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడుగా దొడ్డి గంగసూరి, కార్యదర్శిగా దాడి శివనాగఅప్పారావు, కోశాధికారిగా సూరిశెట్టి నాగదుర్గనాయుడు, డైరెక్టర్లుగా కుంది గంగాధర్, దొడ్డి త్రినాథ్ తదితరులు ఎన్నికయ్యారు. సంఘం సీనియర్ సభ్యుడు దాడి సూర్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికలకు సహాయకులుగా దాడి శివ, దొడ్డి గంగసూరి, రామఅప్పలనాయుడులు వ్యవహరించారు. ఈ సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్‌కు భూములివ్వం

- జానకయ్యపేట రైతుల స్పష్టీకరణ



ఆందోళన చేస్తున్న రైతులు

నక్కపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని జానకయ్యపేట గ్రామ రైతులు స్పష్టం చేశారు. ఆదివారం గ్రామంలోని శ్రీకృష్ణాలయం వద్ద జరిగిన రైతుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి మాట్లాడారు. బల్క్‌డ్రగ్ కోసం అదనపు భూములు సేకరించేందుకు రైతులకు ఇష్టం లేకపోయినా ప్రభుత్వం చేపడుతోందని చెప్పారు. ఈ గ్రామంలో చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం, గొర్రెలు, మేకలు పెంపకంపైనే ఆధారపడి వున్నారని, ఈ భూములు సేకరిస్తే జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కురందాసు సింహాచలం, అప్పలరాజు, రాందాసు నానాజీ, మామిడి బాబ్జీ, రమణ, దేవర సత్తిబాబు ,దేవర రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

మూడు రోజులుగా పిలక మెట్ట చదును

వెదుళ్లవలసలో 15 ఏళ్ల క్రితం ఆక్రమణకు అడ్డుకట్ట

ఇప్పుడు మరలా తెగబడుతున్న ఆక్రమణదారులు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం



మూడు రోజులుగా చదును చేస్తున్న వెదుళ్లనరవలోని పిలక మెట్ట

సబ్బవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు పరిధి వెదుళ్లనరవ గ్రామంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. అక్కడ ఆక్రమణలను అడ్డుకునే నాథులే కరువయ్యారు. మూడు రోజులుగా సుమారు ఎకరం విస్తీర్ణంలో ఉన్న పిలక మెట్టను భారీ యంత్రంతో చదును చేస్తున్నారని రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫోన్‌లు చేస్తున్నా స్పందించకపోవడంతో, శనివారం మధ్యాహ్నం ఓ వ్యక్తి డయల్ 100కు కాల్ చేశారు. దీంతో పోలీసులు వెళ్లి పిలక మెట్ట చదును పనులు అడ్డుకున్నారు.

వెదుళ్లనరవ గ్రామంలోని సర్వే నంబరు 101లో గాజువాక మండలం సంధ్యనగర్ కాలనీకి ఆనుకొని 96 సెంట్లలో పిలక మెట్ట ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో 20 ఏళ్ల క్రితం ఓ రియల్టర్ గాజువాక మండలం దువ్వాడ రెవెన్యూ పరిధిలోని భూములతో కలిపి లే-అవుట్ (సంధ్యానగర్) వేసేశారు. తరువాత వచ్చిన సబ్బవరం రెవెన్యూ అధికారులు ఈ కబ్జాను అడ్డుకున్నారు. మరోసారి 2010లో రియల్టర్ పిలక మెట్ట ఆక్రమణకు తెగపడగా.. అప్పటి తహసీల్దార్ అనిత అడ్డుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. అప్పటి నుంచి దీని జోలికి ఎవరూ పోలేదు.

అయితే ఎప్పటి నుంచో ఈ పిలకమెట్టపై కన్నేసిన కొంత మంది, స్థానిక నేతలు సదరు రియల్టర్‌తో చేతులు కలిపి హస్తగతం చేసుకునేందుకు పన్నాగం పన్నారు. దీంతో మూడు రోజులుగా భారీ యంత్రంతో మెట్ట చదును పనులు చేపట్టారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫోన్‌లు చేసినా స్పందించలేదు. దీంతో డయల్ 100కి కాల్ చేయడంతో శనివారం మధ్యాహ్నం పోలీసులు వెళ్లి చదును పనులు అడ్డుకున్నారు. రెవెన్యూ అనుమతులు లేకుండా ఎటువంటి పనులు చేపట్టవద్దని హెచ్చరించి వచ్చేశారు.

అయితే మరలా శనివారం రాత్రి చదును పనులు కొనసాగించినట్టు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం అక్కడ గజం ధర సుమారు 30 వేలు ఉంది. ఈ లెక్కన పిలకమెట్ట భూమి ఖరీదు సుమారు రూ.15 కోట్లు చేస్తుందని అక్కడ వారు చెబుతున్నారు. అయితే పిలకమెట్ట కబ్జా వెనుక కొంత మంది నాయకుల హస్తం ఉందన్న సమాచారం.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి

జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆర్డీవో వంటి ఉన్నతాధికారులు స్పందించి ప్రకృతి సంపదైన పిలక మెట్ట కబ్జాకు అడ్డుకట్ట వేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఆక్రమణదారులను గుర్తించి పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై వివరణ కోరేందుకు తహసీల్దార్ చిన్నికృష్ణ ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.



84వ వార్డులో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందిస్తున్న బుద్ధ జగదీశ్

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్
- ఉత్సాహంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

అనకాపల్లి టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ, బుద్ధ నాగజగదీశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. 84వ వార్డు పరిధిలోని గొల్లవీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా బుద్ధ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంటే, ఓర్వలేని కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. విశ్వసనీయతకు మారుపేరైన చంద్రబాబు నాయకత్వంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బోడి వెంకటరావు, పీలా తారకేసు, కాండ్రేగుల జగదీశ్ పాల్గొన్నారు. అలాగే 81వ వార్డులోని నిదానందొడ్డి, డైమండ్స్ కాన్వెంట్ వీధుల్లో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి మంచి ఆదరణ లభిస్తున్నదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కాండ్రేగుల సురేశ్, దాడి వాసు, శాంతారాం పాల్గొన్నారు. మళ్లవీధి, పెద్దవీధి, గాంధీబొమ్మ ప్రాంతాల్లో పార్టీ నాయకులు ఎండా రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. 83వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బొద్దపు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు దాడి జగన్, సాయిరాజు, ఎస్.భానుచందర్ పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమంపై దృష్టి: మాజీ ఎమ్మెల్యే పీలా



మృతుని కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న పీలా గోవింద్

కొత్తూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు, వారి కుటుంబాల సంక్షేమంపై తెలుగుదేశం పార్టీ ప్రత్యేక దృష్టిసారించిందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. కొత్తూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన కార్యకర్త గొలగాని వెంకట్రావు చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సభ్యత్వ ఇన్సూరెన్స్‌ను రూ.2 నుంచి రూ.5 లక్షలకు పెంచారన్నారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, కోన శ్రీను, మేడిశెట్టి నూకరాజు, బర్ల నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్, టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పేర్కొన్నారు. మండలంలోని మలునాయుడుపాలెంకు చెందిన రావిపల్లి పైడింనాయుడు అనారోగ్యం బారిన పడి వద్దనే చికిత్స పొందుతున్నారు. మాజీ ఎంపీపీ గండి దేముడు ద్వారా పైడింనాయుడు పరిస్థితి తెలుసుకున్న బాబ్జీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.01 లక్షల చెక్కును ఆదివారం బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫండ్ ద్వారా సీఎం చంద్రబాబు ఎంతో మందికి ప్రాణదానం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండి దేముడు, నాయకులు బలిరెడ్డి అప్పారావు, సూర్యప్రసాద్, బి అప్పారావు, బలిరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన జయప్రదం చేయాలి

సబ్బవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పెందుర్తి పర్యటనను విజయవంతం చేయాలని ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్, టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ కోరారు. సోమవారం పెందుర్తిలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు. అనంతరం గుర్రంపాలెంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. పార్టీ నేతలు, గ్రామ, మండల, అనుబంధ కమిటీల సభ్యులు, ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.జగ్గునాయుడు, నాయకులు జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

స్మార్ట్ మీటర్లను రద్దు చేయకుంటే మరో ఉద్యమం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు గుదిబండలా మారుతున్న అదానీ స్మార్ట్‌మీటర్లను రద్దు చేయకపోతే మరో ఉద్యమానికి నాంది పలుకుతామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న అధ్యక్షతన ఆదివారం జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టమని చెప్పిన ప్రస్తుత మంత్రి లోకేశ్, తిరిగి వాటినే బిగించాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అదానీతో స్మార్ట్‌మీటర్ల ఒప్పందం చేసుకుందన్నారు. దాన్ని రద్దు చేయాల్సిన కూటమి ప్రభుత్వం తిరిగి ఆ ఒప్పందాన్ని అమలు చేస్తుందని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెరుగుదలపైన, స్మార్ట్‌మీటర్ల ప్రమాదాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. స్మార్ట్ మీటర్ల పేరుతో భారం తగదని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో నూకాంబిక అమ్మవారు

- ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతి గాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రముఖ వ్యాపారవేత్త మళ్ల జగ్గఅప్పారావు సహకారంతో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో బాలాలయంలోని అమ్మవారిని ఆలయ అర్చకులు అలంకరించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలిరావడం కనిపించింది. క్యూలైన్లు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులు కుటుంబాల సమేతంగా అమ్మవారి దర్శనానికి వచ్చి ఆలయ ఆవరణతో పాటు పరిసరాల్లోని తోటల్లో వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే జాతీయ రహదారి, పూల్ బాగ్ రోడ్డు, గవరపాలెం తదితర మార్గాలు భక్తులతో సందడిగా మారాయి. పలువురు అమ్మవారి పండగ చేసుకోవడంతో రహదారుల్లో రద్దీ పెరిగింది. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఈవో కె.ఎల్.సుధారాణి, సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఆలయానికి వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

గవరపాలెం సంతోషిమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ మాజీ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు దంపతులు అమ్మవారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో మురళీకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

అనకాపల్లి టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-విజయవాడ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి ఆదివారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడడం వల్ల దువ్వాడ-గోపాలపట్నం రైల్వేస్టేషన్‌ల మధ్య జరిగిన సంఘటనలో మృతి చెందాడన్నారు. ఆయన వయసు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని, ఐదు అడుగుల ఎత్తు, నలుపు రంగు తెలుపు చారల టీషర్టు, బ్లాక్ కలర్ ఆఫ్ నిక్కర్ ధరించి ఉన్నాడని చెప్పారు. మృతదేహం గుర్తు పట్టడానికి వీల్లేకుండా ఉందని, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని ఆమె తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబరు 73820 58996కు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

తుమ్మపాలలో కంటి వైద్య శిబిరం

తుమ్మపాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపాలలో ఆదివారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు 258 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన మందులను అందించారు. వీరిలో 58 మందిని కంటి ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యేరుబండి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో వాకర్స్‌క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, బాబూరావు, దంతులూరి దిలీప్‌కుమార్, బొడ్డపాటి చిన రాజారావు, హరశ్రీనివాసరావు, టి.పెంటయ్యనాయుడు పాల్గొన్నారు.

ఉల్లాసంగా లాంగ్‌వాక్ పోటీలు

అనకాపల్లి టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రింగురోడ్డులో ఆదివారం లాంగ్‌వాక్ పోటీలు ఉల్లాసంగా జరిగాయి. అంతర్జాతీయ స్నేహ దినోత్సవంలో భాగంగా బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. పోటీలను క్లబ్ ప్రతినిధులు ప్రారంభించారు. ప్రధాన రహదారిలోని రింగురోడ్డు నుంచి రైల్వే స్టేషన్ వరకు ఈ పోటీ జరిగింది. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నరసింగరావు, చైర్మన్ పీఎస్ అప్పారావు, అధ్యక్షుడు బీఎస్‌ఎంకే జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్నికాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ప్రశ్నించిన వ్యక్తిపై దాడి

సబ్బవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండంలోని వెదుళ్లనరవ గ్రామంలో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణంపై ప్రశ్నించిన వ్యక్తిపై కొంది మహిళలు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వెదుళ్లనరవ గ్రామానికి చెందిన ఉరుకూటి దండుబాబు శనివారం తన పొలానికి వెళ్తుండగా దారిలోని ప్రభుత్వ భూమిలో షెడ్డు నిర్మిస్తున్నారు. గతంలో ఇక్కడ ఆక్రమ నిర్మాణాలు చేస్తుండగా రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టారని, ఇప్పుడు ఎలా షెడ్డు నిర్మిస్తున్నారని దండుబాబు ప్రశ్నించాడు. దీంతో అతనిపై దాడి చేసి దుర్భాషలాడారని దండుబాబు డయల్ 100కి కాల్ చేశారు. పోలీసులు వచ్చి దాడి చేసిన వారి వివరాలు సేకరించారు. దండుబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ జి.రామచంద్రరావు తెలిపారు.

తగరంపూడిలో మొక్కల పంపిణీ

కొత్తూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తగరంపూడి గ్రామంలో గ్రీన్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి అప్పారావు పాల్గొని మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, వైస్ ఎంపీపీ ఎ.రాము పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు ఉపాధ్యాయుల సత్కారం



ఎమ్మెల్సీ చిరంజీవిరావును సత్కరించిన ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని ఎంవీపీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావును అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బదిలీపై మైదాన ప్రాంతాలకు వచ్చిన ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఉమ్మడి విశాఖ జిల్లా మైదాన ప్రాంతాల నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాకి బదిలీ అయిన ఉపాధ్యాయులను 2025 బదిలీ కౌన్సెలింగ్‌లో అకడమిక్ ఇయర్‌ను పరిగణలోకి తీసుకోవాలని ప్రాతినిధ్యం చేసి ప్రభుత్వాన్ని ఒప్పించి ఉపాధ్యాయులను ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి బదిలీ కావడానికి విశేష కృషి చేసిన ఎమ్మెల్సీకి సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతుబజార్ ఏర్పాటు చేయాలని ఆందోళన

అనకాపల్లి టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రైతుబజారును ఏర్పాటు చేయాలని పలు పార్టీల నాయకులు ఆదివారం కూరగాయల మార్కెట్‌లో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథ బాబు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌కు ఆనుకొని ఉన్న డీసీఎంఎస్ స్థలంలో రైతు బజారు ఏర్పాటు చేస్తే అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎన్నో ఏళ్లుగా రైతు బజారు కోసం ఎదురుచూస్తున్నా కార్యరూపం దాల్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు దళారీల బారినపడి నష్టపోతున్నారని వాపోయారు. రైతుబజారు ఉంటే గిట్టుబాటు ధర రావడంతో పాటు కొనుగోలుదారులకు కూడా సరసమైన ధరలకు కూరగాయలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, స్థానిక నేత బాబ్జీ, రైతులు పాల్గొన్నారు.

27న జిల్లా స్థాయి యోగా పోటీలు

పరవాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెన్నెలపాలెం కల్యాణ మండపంలో ఈ నెల 27న జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రవిశంకర్, సిహెచ్.ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఆగస్టులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పదేళ్ల నుంచి 55 ఏళ్లలోపు వారు ఈ నెల 25లోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 9398740982, 7801083283 నంబర్లకు సంప్రదించాలన్నారు.

చలో విజయవాడకు తరలిరండి

తుమ్మపాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 21న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమానికి తరలిరావాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, కార్మికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 11 ప్రధాన డిమాండ్ల సాధనకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా పైలా



శ్రీనువాసరావు

పరవాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా పరవాడకు చెందిన పైలా శ్రీనువాసరావును నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఆయన ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. పదవిని అప్పగించడంపై పైలా హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మోదకొండమ్మ పండుగ

కశింకోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మోదకొండమ్మ పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ప్రాంత రైతులంతా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు. పండుగను పురస్కరించుకొని ఆలయం వద్ద చిడతలు, చిటికెల భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, రైతు సంఘం అధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శన కరపత్రాల ఆవిష్కరణ

తుమ్మపాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో జరగనున్న 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటక ప్రదర్శన కరపత్రాలను ఆదివారం సిద్దార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆవిష్కరించారు. తొలుత గౌతమ బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, కె.రామారావు, బి.సోమరాజు, ఎ.రమణమూర్తి, పి.చలమాజీ పాల్గొన్నారు.

కుళ్లిన మాంసం విక్రయాలకు అడ్డుకట్ట

కొత్తూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న చేపల మార్కెట్ వద్ద ఆదివారం ఉదయం కుళ్లిన పంది మాంసం విక్రయాలను ప్రజా ప్రతినిధులు అడ్డుకున్నారు. మాంసం దుర్వాసన రావడంతో స్థానికులు వార్డు సభ్యుడికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సర్పంచ్ సప్పారపు లక్ష్మి ప్రసన్న దృష్టికి ఆయన తీసుకువెళ్లారు. ఆమె ఎంపీహెచ్‌వోకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో సమీపంలో ఉన్న వైద్య శాఖ ప్రతినిధి గురునాథ గుప్తాకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న, వార్డు సభ్యుడు పి.శ్రీనివాస్, సిబ్బంది అమ్మకాలను అడ్డుకున్నారు. కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే కేసులు నమోదు చేయిస్తామని వారు హెచ్చరించారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న బీఎంసేఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మేనక పూలు

జి.మాడుగుల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగంపై అందరికీ అవగాహన కలిగి ఉండాలని బీఎంసేఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మేనక పూలు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో జైభీం ఫౌండేషన్ అధ్యక్షుడు సాగెని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డా.బీఆర్ అంబేద్కర్, పూలే సిద్ధాంతాలతో పాటు వారి త్యాగాలపై వివరించారు. వారి ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువల్లో పూడిక తొలగింపు



ఎస్సీ కాలనీలో పూడిక తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ పుష్పలత, కార్యదర్శి

చింతపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పలు వీధుల్లో పూడికల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత తెలిపారు. ఆదివారం రామాలయం, ఎస్సీ కాలనీ వీధుల్లో పూడికను తొలగించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సాధనకు పలు వీధుల్లో చెత్త బుట్టలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రతి రోజు పంచాయతీ సిబ్బంది గృహాల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రానికి తరలిస్తున్నట్టు చెప్పారు. ప్రతి వీధిలో వీధి లైట్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అదనపు కార్మికులను ఏర్పాటు చేసి మురుగు కాలువలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మీకుమార్ పాల్గొన్నారు.

గంగవరం, అగ్రహారంల వద్ద వంతెనలు నిర్మించాలి

▸ గిరిజన సమాఖ్య మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సీలేరు, జూలై 20 (ఆంధ్ర జ్యోతి): జీకే వీధి మండలం ధారకొండ, దుప్పులవాడ పంచాతీ పరిధిలో గత ఏడాది ఈ ప్రాంతంలో సంభవించిన తుఫాన్ ప్రభావానికి కొట్టుకుపోయిన గంగవరం, అగ్రహారంల వద్ద వంతెనలను తక్షణమే నిర్మాణం చేపట్టి గిరిజనుల కష్టాలను తీర్చాలని గిరిజన సమాఖ్య మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబరు 8న ఈప్రాంతంలో వచ్చిన తుఫాన్‌కు గంగవరం, అగ్రహారం వంతెనలు కొట్టుకుపోయారన్నారు. నేటికి 10 నెలలు కావస్తున్నా తాత్కాలిక చర్యలు మాత్రమే చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం వర్షాల సీజన్ ప్రారంభం కావడంతో గ్రా మాల్లో గర్భిణులు, అత్యవసర రోగులను ఆసుపత్రికి తరలించాలన్నా గెడ్డల వల్ల అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే, ప్రస్తుతం గ్రామాల్లో మంజూరైన ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సామగ్రి కూడా వంతెన లేక గ్రామాలకు చేరడం లేదని, నిత్యావసర సరుకు లు తెచ్చుకోవాలన్నా, అలాగే, ఇక్కడ నుంచి ఒడిశా గ్రామాలకు వెళ్లాలన్నా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికార్లు స్పందించి వంతెన నిర్మాణం త్వరిత గతిన చేపట్టి ఇబ్బందులు తొలగించాలని కోరారు.

అంబులెన్స్ మరమ్మతులకు సాయం



వైద్యాధికారికి నగదు అందిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు

అనంతగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలోని అంబులెన్స్ మరమ్మతులకు స్థానిక జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు తన సొంత నిధులు అందజేశారు. కొద్దిరోజుల కిందట మారుమూల ప్రాంతానికి ఓ కేసు నిమిత్తం వెళ్లివస్తుండగా బ్రేక్‌ఫెయిలైంది. అనంతరం వాహనానికి మరమ్మతులు చేపట్టక రోగులుతీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జడ్పీటీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే రోజులు గడుస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో తన సొంత నిధులు రూ.6 వేలను ఆదివారం పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి జ్ఞానేశ్వరికి అందజేశారు. వీటితో అంబులెన్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించి కొత్త అంబులెన్స్ పూర్తి స్థాయిలో మరమ్మతులకు నిధులు మంజూరుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేశ్, అర్జున్, నాగేశ్వరరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఐటీడీఏ ఎదుట నిరుద్యోగుల ధర్నా

పాడేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలనే డిమాండ్‌పై సోమ, మంగళవారాలు ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్టు గిరిజన నిరుద్యోగుల సంఘం కన్వీనర్ ఎస్. సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే , సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల్లో శత శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, గిరిజన నిరుద్యోగుల కోసం స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. ఐటీడీఏ ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని నిరుద్యోగులు విజయవంతం చేయాలని సత్యనారాయణ కోరారు.



వర్షాలకు చిత్తడిగా వలసగెడ్డ గ్రామం...



పక్కన.. ఓ వీధి రహదారి దుస్థితి

ఊరంతా బురదమయం

▸ వలసగెడ్డ గ్రామంలో దుస్థితి ▸ వర్షాలకు మట్టి రహదారులు అస్తవ్యస్తం ▸ గిరిజనులకు అవస్థలు

సీలేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన వలసగెడ్డలో మట్టి రోడ్లు ఇటీవల కురుస్తున్న వర్షాలకు బురదమయమయ్యాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వీధుల్లో నడవడానికి వీలుకాని పరిస్థితిలో బురద ఉంటోంది. గ్రామంలో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు లేక ఈ పరిస్థితి నెలకొంటోంది. గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామానికి 200 మీటర్ల మేర సీసీ రోడ్డు మంజూరు చేయాలని అధికారులను గ్రామస్థులు కోరగా, 100 మీటర్ల రోడ్డు మాత్రమే మంజూరు చేసినట్టు గ్రామస్థులు తెలిపారు. ఇటీవల జనసేన మండల కన్వీనర్ కిల్లో టొక్కుబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కిల్లో గోపీనాథ్ గ్రామాన్ని సందర్శించారు. గిరిజనుల కష్టాలను నేరుగా పరిశీలించారు. గ్రామంలో కొంత మాత్రమే నిర్మాణం చేపట్టి, మిగిలిన ప్రాంతంలో సీసీ రోడ్డు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదమయమై నడవలేని పరిస్థితి నెలకొని గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు వారు తెలిపారు. అధికారులు స్పందించి మిగిలిన 100 మీటర్ల మేర సీసీ రోడ్డు పూర్తి చేయడంతోపాటు, అలాగే, ప్రధాన రహదారి నుంచి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామ ఉపసర్పంచ్ మంగరాజు, పెసా కమిటీ కార్యదర్శి కె నారాయణ తదితరులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

▸ ఏపీ టూరిజం డైరెక్టర్ రమేశ్‌నాయుడు



నీలకంఠానగర్‌లో ప్రచారం చేస్తున్న రమేశ్‌నాయుడు, తదితరులు

పాడేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే ప్రజలకు సంక్షేమ ఫలా లు అందుతున్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్‌నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలో నీలకంఠానగర్‌లో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కుదేలైన రాష్ట్రాన్ని గాడిన పెట్టడడంతోపాటు అభివృద్ధి, సంక్షేమానికి సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన పాలనకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీ సురేశ్‌కుమార్, టీడీపీ నేతలు వి.సురేంద్ర, నగేశ్ పాల్గొన్నారు.

'పారదర్శకంగా 'ఆశ'ల భర్తీ చేపట్టాలి'



డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం సమర్పిస్తున్న గిరిజన నేతలు

పాడేరు, జూలై 20(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ఆశ కార్యకర్తల పోస్టుల భర్తీని పారదర్శకంగా చేపట్టాలని కోరుతూ గిరిజన సంఘాల నేతలు ఆదివారం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిటి.విశ్వేశ్వరనాయుడుకు, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ టి.ప్రతాప్‌కు వినతిపత్రాలు సమర్పించారు. జిల్లాలో 124 ఆశ కార్యకర్తల పోస్టుల భర్తీకి అధికారులు చర్యలు చేపడుతున్నారని, అయితే వాటిని అర్హులకు మాత్రమే దక్కేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లోని సామాజిక ఆరోగ్యకార్తలు, ఆశ కార్యకర్తలతో సమానంగానే విధులు నిర్వహిస్తున్నా, వారికి సరైన వేతనాలు లేవన్నారు. వారిని సైతం ఆశ కార్యకర్తలుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ కోరారు.

టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు చంద్రరావు, సత్యనారాయణ

కొయ్యూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా కాకూరు చంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా తోట వీర సత్యనారాయణ (దొరబాబు) ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం రెండు వర్గాల మధ్య నెలకొన్న విభేదాలతో పార్టీ మండల నూతన కార్యవర్గం ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఆదివారం అనకాపల్లిలో నియోజక వర్గం ఇన్‌చార్జిలు బుద్దా జగదీశ్, గిడ్డి ఈశ్వరి అధ్వర్యంలో ఇరువర్గాలతో చర్చించి ఏకాభిప్రాయంతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేర్చుతామని తెలిపారు.

ఘనంగా బ్రూస్‌లీ వర్ధంతి



బ్రూస్‌లీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కరాటే ఇన్‌స్ట్రక్టర్ పాండురాజు, తదితరులు

పాడేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్ యోధుడు బ్రూస్ లీ 52వ వర్ధంతిని స్థానిక స్టూడెంట్స్ కొపోకాన్ కరాటే క్లబ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్రూస్‌లీ చిత్రపటానికి కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు, బ్లాక్ బెల్ట్ హోల్డర్ లకే మహేశ్వరరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్రూస్‌లీ స్ఫూర్తితో గిరిజన ప్రాంతంలో విద్యార్థులు, యువతకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ, ఆత్మరక్షణలో మెలకువలను నేర్పిస్తున్నట్టు పాండురాజు అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే ఇనస్ట్రక్టర్లు సురేశ్, కామేశ్వరరావు, అప్పన పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మకు సారె సమర్పణ



సారె తీసుకు వస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ భక్తులు

గూడెంకొత్తవీధి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్వీనగర్ గ్రామ దేవత నూకాలమ్మకు ఘనంగా సమరసత సేవా ఫౌండేషన్ భక్తులు సారెను సమర్పించారు. ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహాయక కన్వీనర్ కొక్కుల గీత ఆధ్వర్యంలో భక్తులు ర్యాలీగా అమ్మవారికి సారెను తీసుకువచ్చి మొక్కులు చెల్లించారు. ఆషాఢం ముగుస్తుండడంతో అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ వీరముష్టి వీరాస్వామి పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్

పాడేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ విద్యాశాఖలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం పాడేరు డివిజన్ అధ్య క్షుడు కె.అశోక్ కోరారు ఆదివారం స్థానికంగా నిర్వహించిన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా తమ జీతాలు పెంచాలని, పదవీరమణ చేసే ఉద్యోగులకు రాయితీలు, ఇతర సదుపాయాలు కల్పించాలని, సీనియారిటీ ప్రకారం పర్మినెంట్ చేయాలన్నారు. ప్రమాదబీమా కల్పించాలని, హాస్టల్ వర్కర్ల ఖాళీలు భర్తీ చేయాలని, తమ ఈపీఎఫ్, ఈ ఎస్ఐ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కె.సుబ్బారావు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు న్యాయం చేయాలి'

పాడేరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఉద్యోగ రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావుదొర ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతానికి చెందిన చట్టాలు ఆధారంగా గిరిజనులకు శతశాతం ఉద్యోగ రిజర్వేషన్‌లు కల్పించాలని, టీచర్ పోస్టుల భర్తీకి స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. జీవో 3 రద్దుతో గిరిజనులకు జరిగిన అ న్యాయాన్ని కూటమి ప్రభుత్వం పూడ్చాలన్నారు. వారికి శతశాతం ఉద్యోగ రిజర్వేషన్ కలిగేలా జీవో జారీ చేయాలన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లోనే అభివృద్ధి, సాధకారిత సాధించేలా ప్రభుత్వాలు కృషి చేయాలని రామారావుదొర పేర్కొన్నారు.

మేకలకు అంతుచిక్కని వ్యాధి



కంపుమానుపాకలుతో మూతిపై పుండ్లతో బాధపడుతున్న మేకలు

గూడెంకొత్తవీధి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంపుమానుపాకలు గ్రామంలో మేకలు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నాయి. గ్రామంలో పలువరు గిరిజన రైతులకు మేకలు సుమారు 150 వరకు ఉన్నాయి. ప్రతి మేక నోరు, ముక్కు వద్ద కురుపులతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం మేత మేయడంలేదని గిరిజన రైతులు కొర్ర గంగరాజు, మొట్టడం బాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మేతలేక మేకలు నీరసించిపోతున్నాయని, కొంత మంది రైతులు ఎంతో కొంత ఆదాయం వస్తుందని అత్యంత తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయిస్తున్నారన్నారు. పశువైద్యులు వెంటనే స్పందించి గ్రామంలో మేకలకు మెరుగైన వైద్యం అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంతంతమాత్రంగా ఏటీఎం సేవలు



ముంచంగిపుట్టులో మూసివేసి ఉన్న ఎస్‌బీఐ ఎంటీఎం సెంటర్

ముంచంగిపుట్టు, జులై 20 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంతంలోనైనా ఏటీఎం సెంటర్‌ను చూస్తే నిత్యం ఏసమయంలో వెళ్లినా డబ్బు విత్ డ్రాకు వీలవుతుందని అనుకుంటాం. కానీ, ముంచంగిపుట్టులో స్టేట్‌బ్యాంకు (ఎస్‌బీఐ) ఏటీఎంకు వెళ్తే మాత్రం మూత వేసి ఉంటోంది. దీంతో డబ్బులు తీసుకొనేందుకు వెళ్తే.. ఎప్పుడు షెట్టర్ మూసి వేసి ఉండడంతో పలువురు వినియోగదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. నెలలో పది రోజులు సైతం సెంటర్ తెరవడం కష్టం. ఈ విషయంపై బ్యాంకు అధికారులను అడిగితే.. సాంకేతికలోపం అని సమాధానమిస్తున్నారు.. తప్పా సమస్యను పరిష్కరించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద డబ్బు విత్‌డ్రా చేస్తే రూ.1000కి రూ. 20 నుంచి రూ.50 వరకు కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఏటీఎం నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

ప్రజా సంక్షేమ పాలన

▸ ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర



తురాయిగుడలో పర్యటిస్తున్న సియ్యారి దొన్నుదొర, తదితరులు

అరకులోయ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమ పాలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలోని చినలబుడు పంచాయతీ తురాయిగుడ గ్రామంలో ఆదివారం టీడీపీ పంచాయతీ కమిటీ అధ్యక్షుడు పాంగి భగత్‌రామ్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలో అం దిన సంక్షేమ పథకాల వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ.. గిరిజన అభివృద్ధికి, పెద్ద ఎత్తున మారుమూల గ్రామాల రోడ్లకు నిధులు మంజూరు చేయడంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులను ఆదరించాలన్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కరిస్తామని దొన్నుదొర హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు సుందరమ్మ, సమూయేలు, రాజు, డొంబ్రు, ఆనంద్, సింహాద్రి, కుమారి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

బడికి వెళ్లాలంటే భయం.. భయం



ముల్లుమెట్ట స్కూల్‌కు పొలం గట్ల మధ్య వంతెలచింత చిన్నారులు

హుకుంపేట జూలై 20 ఆంధ్రజ్యోతి: మండలంలోని తిగలవలస పంచాయతీ పంతెల చింత గ్రామానికి చెందిన విద్యార్థులు తడిగిరి పంచాయతీ ముల్లుమెటలోని పాఠశాలకు వెళ్తున్నారు. ఈ క్రమం లో ఇటీవల వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. అయినా, ఈ నీళ్లలో, గట్ల వెంట నడుచుకుని పాఠశాలకు 20 మంది చిన్నారులకు వెళ్లాల్సి రావడంతో తల్లిదండ్రులుఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త మ గ్రామంలో పాఠశాల ఏర్పాటు చే యాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తుది దశలో తాండవ పనులు

... 5వ పేజీ తరువాయి

వివిధ దశల్లో ఉన్నాయి. కాగా మరో 25 పనులకు రూ.2.65 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పెట్టారు.

నేడు ఆయకట్టు రైతులతో సమావేశం

నాతవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ నుంచి ఖరీఫ్‌కు నీటి విడుదల విషయమై సోమవారం నాతవరం జలవనరుల శాఖ కార్యాలయంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ అధ్యక్షతన నీటి సంఘాల అధ్యక్షులు, ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు. అత్యధికుల అభిప్రాయాల మేరకు నీటి విడుదల తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 369.1 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది ఇదే తేదీనాటికి 365.4 అడుగులు మాత్రమే వున్నట్టు చెప్పారు.

'పయనీర్'తో వంతెనకు ముప్పు

... 5వ పేజీ తరువాయి

స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. అదే విధంఆ నర్సీపట్నం నుంచి చింతపల్లి మండలం లంబసింగి వరకు రోడ్డును విస్తరించాలని, దీనివల్ల రెండు జాతీయ రహదారులకు అనుసంధానం ఏర్పడి, రవాణా సదుపాయం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, నర్సీపట్నం డీఈ విద్యాసాగర్, అనకాపల్లి ఏఈ ఎన్.సాంబశివరావు, పెదబొడ్డేపల్లి ఏఈ కె.నారాయణరెడ్డి, నర్సీపట్నం ఏఈ ఎస్.ఎల్.నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు

... 5వ పేజీ తరువాయి

చల్లబడడంతో ప్రజలు ఉపశమం చెందారు. కాగా మండలంలో 37 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

రావికమతం మండలంలో..

రావికమతం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం మధ్యాహ్నం తరువాత ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. కొద్ది రోజుల నుంచి వర్షాలు లేకపోగా.. వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండడంతో వరి నారుమళ్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో వర్షం పడడంతో ఊటర చెందారు. వరి ఆకుమడులకు ఈ వర్షం ఊపిరి పోసిందని అంటున్నారు. అదే విధంగా ఇప్పటికే నాటిన సరుగుడు మొక్కలకు ఈ వర్షం ఎంతో దోహదపడుతుందని చెబుతున్నారు.

చీడికాడలో భారీ వర్షం

చీడికాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చీడికాడతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. రెండు, మూడు వారాల క్రితం వరి విత్తనాలు చల్లిన తరువాత వర్షాలు లేకపోవడంతో నారుమడులు ఎండిపోయి బీటలువారాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఆదివారం భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. అయితే వరినాట్లు వేయడానికి భారీ వర్షాలు కురవాల్సిన అవసరం వుందని అభిప్రాయపడుతున్నారు.

'తొలి అడుగు' వేగవంతం చేయాలి

... 5వ పేజీ తరువాయి

వుండగా, ఇప్పటి వరకు రెండు లక్షల 479 నివాసాలను మాత్రమే సందర్శించామని తెలిపారు. మిగిలిన మూడు లక్షల 19 వేల 230 ఇళ్లను ఈ నెలాఖరులోగా సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, పోలింగ్ బూత్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు పాల్గొన్నారు.

పేట సెగ్మెంట్‌లో వైసీపీకి దెబ్బ

... 5వ పేజీ తరువాయి

వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఎస్.రాయవరంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలను వెల్లడించారు. సుమారు నాలుగేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో వైసీపీ తరపున 18 మంది సర్పంచులు, 17 మంది ఎంపీటీసీలను గెలిపించుకున్నామని గుర్తు చేశారు. అప్పట్లో తమ పార్టీకి చెందిన కొంతమంది నేతల తీరువల్ల ఇబ్బందులు కలగడంతో, నాటి సీఎం జగన్‌ను కలవడానికి అవకాశం కల్పించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడికి, మంత్రులకు, నియోజకవర్గం కన్వీనర్‌కు విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. కానీ మూడేళ్ల కాలంలో ఒక్కసారి కూడా జగన్‌ను కలిసే అవకాశం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి తరువాత కూడా ఇదే పరిస్థితి కొనసాగిందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డిపై అభిమానంతో ఆయన కుమారుడైన జగన్మోహన్‌రెడ్డి వైసీపీని స్థాపించిన వెంటనే ఆ పార్టీలో చేరానని, వైసీపీ అభివృద్ధికి ఎంతో కష్టపడినప్పటికీ అధిష్ఠానం తనను చిన్నచూపు చూస్తున్నదని గోవిందరావు వాపోయారు. పార్టీ నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ' అనే కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఇష్టం లేదని, ఈ కారణాల వల్ల వైసీపీకి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు గోవిందరావు ప్రకటించారు. ప్రస్తుతానికి ఏ రాజకీయ పార్టీలో చేరడం లేదని, ఎంపీపీ (తాత్కాలిక) పదవిలో మాత్రం కొనసాగుతానని స్పష్టం చేశారు.

జి.వెంకటాపురంలో చెత్త కుప్పలు



రహదారిని ఆనుకుని పేరుకుపోయిన చెత్త కుప్పలు

మాకవరపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.వెంకటాపురం గ్రామంలో చెత్త వాతావరణం నెలకొంది. గ్రామానికి ఆనుకుని చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. రహదారికి ఆనుకుని ఉన్న చెత్తాచెదారంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో ఉన్న చెత్తను తీసుకువచ్చి రోడ్డు పక్కనే పడవేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెత్త కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. అధికారులు మాత్రం స్వచ్ఛాంధ్రా అంటూ చేస్తున్న ప్రచారాలు మండల కేంద్రానికే పరిమితవుతున్నాయని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఉన్నప్పటికీ చెత్తను ఇష్టారాజ్యంగా ఎక్కడబడితే అక్కడ పడవేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పక్కన చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా ఆర్‌వో ప్లాంట్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగునీటికి విద్యార్థుల ఇక్కట్లు



కళాశాలలో చుక్క తాగునీరు ఇవ్వని ఆర్‌వో ప్లాంట్ ఇదే..

కృష్ణాదేవిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌వో ప్లాంట్ రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనాడు-నేడు నిధులు రూ.5 లక్షలు వెచ్చించి ఆర్‌వో ప్లాంట్ కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఈ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురాలేదు. నాడు-నేడు నిధులు కొరతతో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు గ్రహణం పట్టిందని అధ్యాపకులు చెబుతున్నారు. అలాగే కళాశాల ప్రహరీ, రోడ్డు సౌకర్యం, ఇతర మరమ్మతు పనులు కూడా అసంతృప్తిగా మిగిలిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌వో ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావాలని, అభివృద్ధి పనులు పూర్తిచేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

కల్వర్టు శిథిలం.. రాకపోకలు కష్టం!

విశాఖ-దేవరాపల్లి రహదారిలో ప్రయాణికుల అగచాట్లు

కృష్ణారాయుడుపేట వరకే బస్సులు.. దోచేస్తున్న ఆటో వాలాలు



కృష్ణారాయుడుపేట వద్ద నిలిచిపోయిన బస్సు

దేవరాపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి-విశాఖపట్నం రోడ్డులో కృష్ణారాయుడుపేట వద్ద కల్వర్టు కూలడానికి సిద్ధంగా ఉండడంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. జీవీఎంసీకి నీరు సరఫరా చేసే కాలువపై కల్వర్టు పరిస్థితి బాగోలేదని ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టడంతో 12డి బస్సులను అక్కడ వరకు నడుపుతున్నారు. దేవరాపల్లి- విశాఖ ఆర్కే బీచ్ 68డి ఆరు బస్సులు తిరుగుతుంటాయి. విశాఖపట్నం నుంచి దేవరాపల్లికి రూ.50 బస్సుచార్జి. అయితే కల్వర్టు బాగో లేకపోవడంతో 68డి బస్సులను కృష్ణారాయుడుపేట వద్ద నిలిపివేస్తున్నారు. ఇక్కడ నుంచి దేవరాపల్లికి ఆటోవాలాలు రూ.30 తీసుకుంటున్నారు. దీంతో తమపై అదనపు భారం పడుతుందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఈ విషయాన్ని మద్దిలపాలెం డిపో మేనేజరు కె.పద్మావతి వద్ద ప్రస్తావించగా.. తాను కల్వర్టును పరిశీలించామని, కల్వర్టు కుంగిపోయి ఉండడంతో 12డి బస్సులను కల్వర్టు వరకు నడుపుతామన్నారు. అక్కడ నుంచి ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆర్‌అండ్ ఏఈఈ బాలాజీ వద్ద ప్రస్తావించగా.. కల్వర్టు కూలిపోయే ప్రమాదం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లే విధంగా ఉంచి, మిగతా రోడ్డు మూసివేశామన్నారు. నూతన కల్వర్టు నిర్మాణానికి రూ.91 లక్షలతో ప్రతిపాదనలు పంపించారని, ఈనెల 25న టెండర్లు జరుగుతాయన్నారు.

తమ్మయ్యపాలెంలో జ్వరాల విజృంభణ

గ్రామంలో పారిశుధ్య లోపం.. ప్రజల్లో రోగాల భయం

మాకవరపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వజ్రగడ పంచాయతీ పరిధిలోని శివారు తమ్మయ్యపాలెంలో జ్వరాలు విజృంభించాయి. వారం రోజుల క్రితమే గ్రామంలో జ్వరాలు రావడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇప్పుడు శివారు గ్రామం తమ్మయ్యపాలెంలో పారిశుధ్యం అధ్వానంగా మారడంతో మళ్లీ జర్వాలు విజృంభించాయి.



మురికి కూపంలా ఉన్న గ్రామంలోని ఓ వీధి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్... మంచపట్టిన అశ్విని

గ్రామంలోని కాలువల్లో బురద వల్ల దోమలు విలయతాండవం చేస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఇప్పటికే జర్వాలు పెరగడంతో పారిపల్లి ప్రసాద్, అశ్విని ప్రైవేటు ఆసుపత్రిలో కిత్స పొందుతున్నారు. వైద్య సిబ్బంది గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. అలాగే గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, దీంతో రోగాలు ప్రబలుతున్నాయని వారు వాపోయారు. కాలువల్లో మట్టిని తీసివేసి రోడ్డుపైన వదలివేయడంతో కంపు కొడుతుందని వారు చెబుతున్నారు. రోడ్డుపైన చెత్త కుప్పలు తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని వారు అంటున్నారు. ఇప్పటికైనా పారిశుధ్యం మెరుగుపర్చాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు.

గురుకులంలో క్రీడా మైదానం అభివృద్ధి చేయరూ..

గొలుగొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలయోగి గురుకుల కళాశాల ఆట స్థలం అభివృద్ధి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. మండల కేంద్రంలోని గురుకుల కళాశాలలో సుమారు ఐదు ఎకరాలు ఆట స్థలం విద్యార్థుల క్రీడలకు ప్రభుత్వం కేటాయించింది. ఈ కళాశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 570 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే విద్యార్థులను క్రీడాకారులుగా అభివృద్ధి చేసేందుకు ఆట స్థలం కేటాయించినా, దాన్ని అభివృద్ధి చేయాలన్న విషయాన్ని సంబంధిత అధికారులు మర్చిపోయారు. దీంతో విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉంటున్నారు. అధికారులు స్పందించి ఈ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.



పంట పొలాన్ని తలపించేలా ఉన్న క్రీడా మైదానం



ఓ ఇంటి ప్రహరీ గోడపై సంచరిస్తున్న కోతులు

కోతుల బెడద నివారించాలి

నర్సీపట్నం అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లి, ఓల్‌పురం, వేములపూడి తదితర గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైంది. గుంపులు గుంపులుగా కోతులు గ్రామంలోకి వచ్చేస్తున్నాయి. ఇళ్ల పరిసరాలు, ప్రహరీ గోడలపైన స్వైరవిహారం చేస్తున్నాయి. కొన్ని సార్లు ఇళ్లల్లోకి కూడా చొరబడుతున్నాయి. దీంతో కోతుల బెడదను భరించలేకపోతున్నామని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. అలాగే కోతులు పంట పొలాలను నాశనం చేయడమే కాకుండా ఇళ్లలోకి చొరబడి ఏది దొరికితే అది ఎత్తుకెళ్తున్నాయని వారు వాపోతున్నారు. గత కొంత కాలంగా గ్రామాల్లో యథేచ్ఛగా తిరుగుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నట్టు వారు మదన పడుతున్నారు. దీంతో బయటికి రావాలంటే భయంగా ఉందని వాపోయారు. సంబందింత అధికారులు తక్షణమే స్పందించి కోతుల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

27న జిల్లా స్థాయి యోగా పోటీలు

పరవాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెన్నెలపాలెం కల్యాణ మండపంలో ఈ నెల 27న జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రవిశంకర్, సిహెచ్.ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఆగస్టులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పదేళ్ల నుంచి 55 ఏళ్లలోపు వారు ఈ నెల 25లోగా పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 9398740982, 7801083283 నంబర్లకు సంప్రదించాలన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-విజయవాడ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి ఆదివారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడడం వల్ల దువ్వాడ-గోపాలపట్నం రైల్వేస్టేషన్‌ల మధ్య జరిగిన సంఘటనలో మృతి చెందాడన్నారు. ఆయన వయసు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని, ఐదు అడుగుల ఎత్తు, నలుపు రంగు తెలుపు చారల టీషర్టు, బ్లాక్ కలర్ ఆఫ్ నిక్కర్ ధరించి ఉన్నాడని చెప్పారు. మృతదేహం గుర్తు పట్టడానికి వీల్లేకుండా ఉందని, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని ఆమె తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబరు 73820 58996కు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

13 మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలోని 13మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.9.53 లక్షల సహాయం మంజూరైంది. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, టీడీపీ నాయకులు శంకర్, పుల్లేటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మిస్ వైజాగ్ శ్రావణ లక్ష్మి విజేతగా తన్వి సుచరిత



మిస్ వైజాగ్ శ్రావణ లక్ష్మి విజేతగా అవార్డు అందుకుంటున్న సుచరిత

బుచ్చెయ్యపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సీజన్ 5 మిస్ వైజాగ్ శ్రావణ లక్ష్మి విజేతగా తన్వి సుచరిత నిలిచింది. శనివారం విశాఖలో నిర్వహించిన ఈ పోటీల్లో 13 మంది పాల్గొన్నారు. వీరిలో మండలంలోని తురకలపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంధ్యారాణి కుమార్తె తన్వి సుచరిత విజేతగా ఎంపిక చేశారు. చివరి రౌండ్ వరకు పోటీ ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ పిల్లలను విద్యతోపాటు వారికి ఇష్టమైన రంగాలలో ప్రోత్సహిస్తే మరింత ఉన్నతంగా రాణిస్తారన్నారు. మిస్ వైజాగ్ శ్రావణ లక్ష్మి విజేత తన్వి సుచరితను పలువురు అభినందించారు.

పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



ఉపాధ్యాయులను సన్మానం చేస్తున్న సహచరులు

మాడుగుల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆర్ట్,క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయులు కోరారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌లు బదిలీపై వెళుతున్న తోటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామన్నారు. రిటైర్ అయిన తర్వాత గ్రాట్యూటీ కల్పించాలని కోరారు. ఉద్యోగులకు ఈహెచ్ఎస్,ఈపీఎఫ్ కల్పించాలని కోరారు.

కేజేపురంలో ఘనంగా మోదకొండమ్మ జాతర

మాడుగుల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల మండలం కేజేపురంలో మోదకొండమ్మ జాతర ఘనంగా ఆదివారం నిర్వహించారు. భక్తులు ఆధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకొన్నారు. మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాడుగుల ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, నందారపు సన్యాసిరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మోదకొండమ్మను దర్శించుకొంటున్న బండారు, బత్తుల, తదితరులు

దేవరాపల్లిలో సామూహిక వ్రతాలు

దేవరాపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయిబాబా జ్ఞాన మందిరంలో సామూహిక వ్రతాలు ఆదివారం నిర్వహించారు. భజనలు, వ్రతాలు నామ సంకీర్తనలు చేస్తూ 180 మంది భక్తులు వ్రతాలు చేశారు.కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, జోన్ ఇన్‌చార్జి సీహెచ్‌వీ. రవిశంకర్, పెంటారావు, వెంకటపతి, కన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయిబాబా ఆలయంలో వ్రతాలు చేస్తున్న మహిళలు

బకాయిలకు ఉపాధి కూలీల ఎదురుచూపు

కోటవురట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేస్తున్న ఉపాధి కార్మికులకు ఎనిమిది వారాల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బకాయిలు జనవరి నుంచి మార్చి వరకు జమ చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోందని ఉపాధి కార్మికులు వాపోతున్నారు. ఉపాధి హామీ పథకం కార్మికులు చేసిన పనుల వివరాలను సిబ్బంది ప్రతి వారం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అలా అప్ చేసిన పనులకు సంబంధించి కార్మికులకు 15 రోజుల్లో వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. ప్రతీ ఉపాధి కార్మికుడికి రోజు వారి వేతనం రూ.300 వచ్చేవిధంగా పని కల్పించాలి. అయితే మండలంలో సగటు వేతనం రూ.298 మించలేదు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 13,396 మందికి ఉపాధి జాబ్‌కార్డులు ఉండగా.. 10,999 మంది కార్మికులు ఉన్నారు. వీరిలో ప్రస్తుతం 2,500 మంది కార్మికులు ఉపాధి పనులకు వస్తున్నారు. మంగళవారం నాటికి కార్మికులకు వేతనాలు రూ.75 లక్షలు, మెటీరియల్ రూ.80లక్షలు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఈ వేతనాలను ఎప్పుడు ఇస్తారో అని ఉపాధి కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

కాగా, ఉపాధి హామీ పనులు పనిచేసిన కార్మికుల వేతనాలు ఎనిమిది వారాల నుంచి చెల్లించడం లేదని ఏపీవో నాగరాజు తెలిపారు. కూలీలు వేతనాల కోసం ప్రతి వారం అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. మరో వారం రోజుల్లో వేతనాలు చెల్లించే అవకాశం ఉందన్నారు.

కొండపాలెంలో మొలకెత్తని వరి విత్తనాలు



నారుమడిలో మొలకెత్తని విత్తనాలు

బుచ్చెయ్యపేట, జూలై 20 (ఆంధ్ర జ్యోతి): నారుమడిలో మొలకెత్తని వరి విత్తనాలతో రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని కొండపాలెం గ్రామంలో సర్పంచ్ ముచ్చకర్ల భవాని, తాతీలు రైతు సేవా కేంద్రంలో కొనుగోలు చేసిన 2 బస్తాలు వరి విత్తనాలు 20 రోజుల క్రితం నారుమడిలో చల్లారు. అవి మొలకెత్తలేదని ముచ్చకర్ల తాతీలు తెలిపారు. మళ్లీ విత్తనాలు చల్లి మొలకెత్తడానికి ఆలస్యం అవుతుందని, ఇలా చేస్తే వరి పంట చీడపీడల బారిన పడి దిగుబడి తగ్గుతుందన్నారు. వ్యవసాయాధికారులు ఇటువంటి విత్తనాలను ప్రోత్సహించరాదన్నారు.

దొండపూడిలో ఘనంగా ముత్యాలమ్మ పండగ

రావికమతం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపూడిలో ముత్యాలమ్మ పండగ ఆదివారం గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఏటా వరి విత్త నాలు చల్లిన తర్వాత.. దమ్ములకు ముందు గ్రామంలో అమ్మవారి పండగను నిర్వహిస్తారు. అమ్మవారిని వేకుజాము నుంచే భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలను సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలతో బాణసంచా కాల్చుతూ ఊరేగించారు.



దొండపూడిలో ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



మరణించిన వారి కుటుంబ సభ్యులతో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, నేతలు

బుచ్చెయ్యపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిదొరపాలెంలో ఇటీవల మృతి చెందిన ఆరు కుటుంబాల సభ్యులకు జనసేన గ్రామ నాయకుడు మండపాక బాబూరావు సమకూర్చిన రూ.12 వేలను జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్. రాజు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సేవ చేయడంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ముందుంటారన్నారు. కార్యక్రమమలో మండల అధ్యక్షుడు డీఎస్. నాయుడు, బలిజ మహారాజు, బి.అరుణ్, గోవింద్, నగేశ్, కిషోర్, రత్నాజి పాల్గొన్నారు.

బుచ్చెంపేట పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

రోలుగుంట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మరణ ధ్రువీకరణ పత్రం, ఇంటి పన్నులు, ఇతర ధ్రువపత్రాల జారీపై ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న బుచ్చెంపేట పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ చీపురుపల్లి వెంకునాయుడు, బాధితుడు ఇశంశెట్టి అప్పలనాయుడు డీపీఓ సందీప్‌కు ఫిర్యాదు చేశారు.

గ్రామానికి చెందిన ఇశంశెట్టి సన్యాసమ్మ, ఇశంశెట్టి జోగునాయుడు, ఇశంశెట్టి కొండబాబులకు సంబంధించి మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి రూ.3వేలు డిమాండ్ చేశాడని వారు తెలిపారు. దీనికి సంబంధించి ఫోన్ పే ద్వారా డబ్బు పంపించినట్టు తెలిపారు. అలాగే తన తల్లి సన్యాసమ్మ పేరున ఉన్న ఇంటి పన్నును కుమారుడు అప్పలనాయుడు పేరున మార్చడానికి రూ.3వేలు డిమాండ్ చేశారన్నారు. అలాగే పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.6వేలు చెల్లించకుండా వారితో వేలిముద్రలు వేయించుకుని రూ.3వేలు మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.